క్లుప్తంగా

అందుబాటులో రైతుబజారు

గోపాలపట్నం: వినాయక చవితి సందర్భంగా మంగళవారం గోపాలపట్నం రైతు బజారు అందుబాటులో ఉంటుందని ఈవో ప్రసాద్ తెలిపారు. సాధారణంగా వారంలో మంగళ వారం సెలవు ఉంటుందని... బుధవారం వినాయక చవితి నేపథ్యంలో వినియోగదారుల సౌకర్యం కోసం ఈ మంగళవారం సెలవు రద్దు చేసినట్టు చెప్పారు. వినియోగదారులు గమనించి రైతు బజారు సేవలు వినియోగించుకోవాలని కోరారు.

కూటమి మోసాలపై ఇంటింటా ప్రచారం



వాయుపుత్రకాలనీలో కూటమి మోసాలను వివరిస్తున్న రేవళ్ల సత్యనారాయణ

మల్కాపురం: ఇచ్చిన మాట తప్పడం కూటమి నాయకులు నైజం అని 59వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ ఆరోపించారు. వాయుపుత్రకాలనీలో ఆదివారం కూటమి మోసాలపై ఇంటింటి ప్రచారం చేశారు. మద్యం తప్పా మరేదీ అందుబాటులో లేదని.. ఉచిత గ్యాస్ డబ్బులు పడడం లేదని మహిళలు చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు భూపతి,ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

హద్దు మీరితే చర్యలు తప్పవు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ గొలగాని అప్పారావు

మల్కాపురం: హద్దు మీరితే కఠిన చర్యలు తప్పవని మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు రౌడీషీటర్లను హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్ వద్ద రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. వినాయక ఉత్సవాల సమయంలో మండపాల వద్దకు వెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించడం, మహిళలను వేధించినా సహించేది లేదన్నారు. మర్యాదగా నడుచుకుని సమాజంలో గౌరవంగా జీవించాలని సూచించారు. కుటుంబాలను గుర్తుకు తెచ్చుకుని కష్టపడి పని చేసి అందరితో మర్యాదగా మసులు కోవాలన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి



కౌన్సెలింగ్ ఇస్తున్న ఏఎస్ఐ గోవిందమ్మ

గోపాలపట్నం: నేర చరిత్ర గల వారు సత్ప్రవర్తనతో మెలగాలని ఏఎస్ఐ గోవిందమ్మ సూచించారు. ఈ మేరకు ఆదివారం క్రైం పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచి నడుచుకుని కుటుంబాలతో సంతోషంగా జీవించాలన్నారు. పోలీసుల నిఘా ఎప్పుడూ ఉంటుందని హెచ్చరించారు. ఎవరికైనా ఆరోగ్యం బాగా లేకున్నా.. వ్యక్తి గత సమస్యలు ఉంటే పోలీస్ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

గోపాలపట్నం: ఎస్‌పీడీ దరి ఇందిరా ప్రియదర్శిని కాలనీలో మొబైల్ బెల్టు షాపు నిర్వహిస్తున్న అల్లు రామును ఆదివారం ఎయిర్‌పోర్టు పోలీసులు అరెస్ట్ చేశారు. ఉదయం సమయంలో స్కూటీ డిక్కీలో మద్యం సీసాలు పెట్టి అమ్ముతుండగా గస్తీ తిరుగుతున్న ఎయిర్‌పోర్టు పోలీసులు పట్టుకున్నారు. రాము నుంచి 29 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఉమామహేశ్వరరావు నిందితుడిపై కేసు నమోదు చేశారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం స్వర్ణపుష్పార్చన సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపం వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తరపూజ నిర్వహించారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఉభయదాతలకు ప్రసాదం అందజేశారు.



తుది మెరుగులు దిద్దుతున్న కళాకారుడు ఉమా మహేశ్వరరావు



ఐటీఐ జంక్షన్ గణేష్‌నగర్‌లో భారీ హర్రర్ సెట్...



గొల్లకంచరపాలెంలో నాగలోకం సెట్‌కు తుది మెరుగులు

సెట్టు.. అదిరేట్టు

- ఆలోచింపజేసేలా గణపతి మండపాలు
- మండపాలకు చేరుకుంటున్న బొజ్జగణపయ్య
- అంతటా చవితి సందడి

కంచరపాలెం:

వినాయక చవితి సందడి మొదలైంది. ముహూర్తపు రాటలు వేసి గణపతి నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ చేసి నిర్వాహకులు భారీ సెట్లు వేశారు. మిరమిట్లు గొలిపేలా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్నారు. కొంతమంది సమాజానికి సందేశం ఇచ్చేలా... విభిన్న ఆకృతుల్లో మండపాలను సిద్ధం చేశారు.

మంగళవారం వినాయక విగ్రహాలను తీసుకురాకుడదనే సెంటిమెంట్‌తో చాలా మంది ఆదివారం సాయంత్రమే విగ్రహాలను తరలించారు. మరో వైపు చిన్న చిన్న వ్యాపారులు సైతం ఇళ్లల్లో పూజలు చేసుకునే వారి కోసం మార్కెట్‌లో గణపతి బొమ్మలు విక్రయానికి పెట్టారు. జీవీఎంసీ 56, 57వ వార్డుల పరిధిలోని కంచరపాలెం, ఊర్వశికూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, మర్రిపాలెం , కరాసా ప్రాంతాల్లో యువత నుంచి పెద్దవాళ్ల వరకు గణపతి బప్పా మోరియా అంటూ వీధిల్లో పందిళ్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. వీధులు కళకళలాడుతున్నాయి. చిత్ర విచిత్రమైన భారీ సెట్లతో గణపతి పందిర్లు ఆలోచింపజేసే విధంగా ఉన్నాయి. మండపాల లోపల గణపతి విగ్రహం ఏర్పాటుకు ఒక వేదిక ఐతే.... పందిరి బయట ప్రధాన ద్వారాలు, గోపురాలు వంటి భారీ సెట్‌లు వేయడంలో యువత ప్రతిభను చూపుతున్నారు. ఐటీఐ జంక్షన్ దరి గణేష్‌నగర్‌లో నిర్వాహకుడు కొలుసు కుమార్ నేతృత్వంలో హర్రర్ సెట్‌ను భారీగా ఏర్పాటు చేస్తున్నారు. కళాకారుడు ఉమామహేశ్వరరావు ఈసెట్‌ను నిర్మిస్తున్నారు.

- భవానీ గార్డెన్స్‌లో సింహాచలం గాలిగోపురం మోడల్ సెట్ ఏర్పాటు చేస్తున్నారు.
- గొల్లకంచరపాలెం రైల్వేట్రాక్ రహదారిలో చిన్నారులు నాగ లోకం సెట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. తోటవీధి, దుర్గానగర్, గోకుల్‌నగర్, గౌరీనగర్, సుభాష్‌నగర్, తుమ్మడపాలెం, పైడిమాంబకాలనీ, దయానందనగర్, గవర కంచరపాలెం, రామ్మూర్తిపంతులుపేట, చాకలిగెడ్డ, రాజీవ్‌కాలనీ, తదితర ప్రాంతాల్లో పోటాపోటీగా వినాయక మండపాలు ఏర్పాటు చేస్తున్నారు.



భవానిగార్డెన్స్‌లో సింహాచలం గాలిగోపురం నమూనా సెట్



మార్కెట్‌లో సందడి



మల్కాపురం వద్ద అమ్మకానికి సిద్ధంగా గణనాథులు

మల్కాపురం: వినాయక ప్రతిమలను మార్కెట్‌లో వివిధ ఆకృతుల్లో విక్రయానికి పెట్టారు. పెద్దపెద్ద కమిటీలు ప్రత్యేకంగా ఆర్డర్లు ఇచ్చి ప్రతిమలు చేయించుకున్నారు. అయితే అపార్ట్‌మెంట్ సొసైటీలు.. ఇళ్లల్లో పూజలు చేసే వారి కోసం మార్కెట్‌లో గణపతి బొమ్మల విక్రయాలు ప్రారంభమయ్యాయి. మల్కాపురం, సింధియా, శ్రీహరిపురం, గుల్లలపాలెం వంటి ప్రాంతాల్లో మార్కెట్‌తో పాటు రోడ్లకు ఇరువైపులా విగ్రహాలను విక్రయిస్తున్నారు. ఇక మండపాలను ముస్తాబు చేయడానికి అవసరమైన సామగ్రి కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ధరలు మాత్రం ఈ ఏడాది మోత మోగుతోందని నిర్వాహకులు చెబుతున్నారు.



శ్రీహరిపురం వద్ద ..

గణేష్ ఉత్సవ నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

గోపాలపట్నం సీఐ ఎన్‌వీ ప్రభాకర్

గోపాలపట్నం: గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, నిర్వాహకులు పోలీసులు సూచించిన మార్గ దర్శకాలు, నిబంధనలను పాటించాలని గోపాలపట్నం సీఐ ఎన్‌వీ ప్రభాకర్ సూచించారు. మండపాల వద్ద ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆదివారం ఆయన ఉత్సవ కమిటీల ప్రతినిధులకు నిబంధనలను వివరించారు. షార్ట్ సర్క్యూట్ కాకుండా ఉండే విధంగా వైరింగ్ చేయాలని సూచించారు. విద్యుత్ తీగలకు జాయింట్లు లేకుండా చూసుకోవాలని తెలిపారు. అత్యవసరంగా జాయింట్లు కలిపినా వాటికి టేప్ మందంగా చుట్టాలని , కేవలం 3పిన్ ప్లగ్‌లు, ఎంసీబీ సాకెట్లు మాత్రమే వాడడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విగ్రహాల నిమజ్జనం అధికారికంగా గుర్తించిన ప్రదేశాల్లో మాత్రమే చేయాలని తెలిపారు. మండపాల్లో పేలుడు పదార్థాలు ఉంచరాదని సూచించారు. మండపాల్లో ఇసుక, నీరు తప్పని సరిగా ఉంచాలని తెలిపారు. ఎవరైనా మద్యం, గంజాయి తాగి అల్లర్లు సృష్టించే పనులు చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. కమిటీ సభ్యులు ఇలాంటి వారిని కనిపెట్టి సమాచారం వెంటనే పోలీసులకు తెలియజేయాలని తెలిపారు.

మట్టి గణపతులనే పూజిద్దాం

- మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: మట్టి గణపతులను పూజించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవుదామని మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. జీవీఎంసీ 52వ వార్డు పరిధిలోని మర్రిపాలెం వుడాలేఅవుట్‌లో స్వాతి ప్రమోటర్స్ అందించిన మట్టి విగ్రహాలను ఆయన పంపిణీ చేశారు. దేశంలో విశాఖను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు నడుంకట్టాలన్నారు.



మర్రిపాలెం వుడాలేఅవుట్‌లో మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న జియ్యాని శ్రీధర్

పందిరి రాట : ఇక్కడి వరసిద్ధి వినాయక ఆలయంలో శాస్త్రోక్తంగా పందిరి రాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చవితి రాట మహోత్సవం

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి శ్రీనాథపురంలో హనుమాన్ యూత్ డీసెంట్ బాయ్స్ ఆధ్వర్యంలో వినాయక మహోత్సవాలకు పందిరి రాటను ఆదివారం వేశారు. 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు, కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సింగవరపు సత్యనారాయణ, సూర్యనారాయణ, చక్రవర్తుల కనకారావు, బొమ్మ మధు, సాంబశివ, బల్ల శివశంకర్రావు, కమిటీ సభ్యులు నవీన్‌కుమార్, ప్రవీణ్, జ్ఞాన అనుదీప్, చంటి, రాజేష్, పూర్ణ, గోపి, శ్యామ్, సాయి, ప్రసాద్, శ్రీను, దిలీప్, రాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు.



పందిరి రాట వేస్తున్న నాయకులు

ఈవోఐలను రద్దు చేయాలి

నిర్వాసిత కాలనీల్లో ఉక్కు సంకల్పర్యాలీ



నడుపూరు గాంధీ పార్కు వద్ద మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

ఉక్కునగరం/పెదగంట్యాడ/కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, 32 డిపార్టుమెంట్లకు సంబంధించిన ఈవోఐ టెండర్లను రద్దు చేయాలని ఉక్కు అఖిల పక్ష సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని.. ఈవోఐలను రద్దు చేయాలనే డిమాండ్‌తో ఆదివారం ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వ్యతిరేకంగా నిర్వాసిత కాలనీలతో పాటు ఉక్కు నగరంలో ఆదివారం ర్యాలీలు నిర్వహించారు. ర్యాలీ అన్ని సెక్టార్ల మీదుగా సెక్టార్–3 కాంప్లెక్స్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏతో కూడిన పెండింగ్ జీతాలు చెల్లించాలని, టౌన్‌షిప్‌లో కరెంట్ చార్జీలు తగ్గించాలన్నారు. కార్యక్రమంలో మంత్రి రాజశేఖర్, రామస్వామి, ఎస్.రామారావు, రామకృష్ణ, పిట్టా రెడ్డి, గణపతి, పీవీ రమణమూర్తి, మసేన్‌రావు, తాతారావు , పి.వేణుబాబు. కె.భాస్కరరావు సన్యాసిరావు, దానయ్య, రాజశేఖర్. చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు..



86వ వార్డులో ప్రదర్శన చేస్తున్న ఉక్కు కార్మిక సంఘాల నాయకులు



ఉక్కునగరంలో ప్రసంగిస్తున్న కార్మిక నాయకులు

మాట తప్పడంలో బాబు నంబర్ వన్

- రాష్ట్రాన్ని పసుపుపతి పీడిస్తున్నాడు
- అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చేశారు
- ఉచిత ఇసుకపేరిట దోపిడీ
- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్
- జీవీఎంసీ 61, 91వ వార్డుల్లో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ
- పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు



హాజరైన కార్యకర్తలు, అభిమానులు



సభలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్

గోపాలపట్నం: హామీలు పూర్తిస్థాయిలో నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసగించిందని వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ ధ్వజమెత్తారు. జీవీఎంసీ 91వ వార్డు ఎస్సీకాలనీలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విజయప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గత ప్రభుత్వం ఇచ్చిన పథకాలతో పాటు ఇంకా ఎక్కువ సంక్షేమం అందిస్తామని చంద్రబాబు, కూటమి నాయకులు ఊదరగొట్టారని గుర్తు చేశారు. అయితే సూపర్ సిక్స్ పథకాల్లో ఏ ఒక్కటీ పూర్తి స్థాయిలో అమలు చేయలేదని ఎద్దేవా చేశారు. ఈ విషయం గురించి అడిగితే 'నాలుక మందంగా ఉందా?'అని ప్రశ్నిస్తున్నారన్నారు. అబద్ధాలు చెప్పి చంద్రబాబు నాలుక మందంగా మారిపోయిందని, అందుకే అన్ని హామీలు అమలు చేశామని చెబుతున్నారని విమర్శించారు. కూటమి నాయకులు మీ వద్దకు వస్తే హామీల గురించి నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు గాలికొదిలేశారు

నిరుద్యోగ భృతిని భ్రాంతిగా మార్చేశారని మళ్ల విజయప్రసాద్ విమర్శించారు. నిరుద్యోగులను నిలువునా ముంచారని ఆరోపించారు. ఏడాదికి 20 వేల ఉద్యోగాలు ఇస్తామని, లేకపోతే నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారని, కానీ ఇంతవరకు ఉద్యోగమూ లేదు, భృతి లేదన్నారు. నిరుద్యోగులకు ఏడాదికి రూ.36 వేలు బాకీ పడ్డారన్నారు. విద్యార్థులకు కూడా మొదటి సంవత్సరంలో 'తల్లికి వందనం'పథకాన్ని ఎగ్గొట్టారని దుయ్యబట్టారు. ఎలాంటి నిబంధనలు లేకుండా ఇస్తామని చెప్పి.. ఒక కుటుంబానికి 10 మీటర్లు ఉన్నట్లుగా నిబంధనలను సృష్టించి పథకానికి దూరం చేశారని ఆరోపించారు.

డ్వాక్రా మహిళలకు రుణాల హామీలో మోసం

డ్వాక్రా మహిళలకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు రుణాలను ఇస్తామని నమ్మించి ఓట్లు వేయించుకున్న తరువాత ఇప్పుడు రుణాలను మంజూరు చేయడం లేదని మళ్ల విజయప్రసాద్ అన్నారు. ఇలా ప్రతి ఒక్కరిని మోసం చేసి ఇప్పుడు అడిగితే అందరికీ ఇచ్చేశామని చెబుతున్నారని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్య, ఆరోగ్యం రంగాలకు పెద్దపీట వేశారని, కానీ కూటమి ప్రభుత్వంలో ఈ రంగాలను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. ఆరోగ్యశ్రీని అందని ద్రాక్షపండులా చేశారని, చాలా వైద్య సేవలను తొలగించేశారని విమర్శించారు. 91వ వార్డు ఇన్‌చార్జి, అధ్యక్షుడు ఆళ్ల పైడిరాజు, చెంగల హరినాథ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ విభాగం అధ్యక్షుడు చుక్క పైడిరాజు రెడ్డి, ఉష, రాజు, చుక్క అప్పలరెడ్డి, వార్డు నాయకులు పాల్గొన్నారు.

ఇసుక సొమ్ము ఎక్కడికి వెళ్లోంది?

మల్కాపురం: ఉచిత ఇసుక పేరుతో వసూలు చేస్తున్న డబ్బు ఎవరి జేబిలోకి వెళ్తుందో సీఎం చంద్రబాబు చెప్పాలని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ ప్రశ్నించారు. 61వ వార్డు పరిధిలోని మల్కాపురం నగరాలవీధిలో ఆదివారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని వార్డు పార్టీ అధ్యక్షుడు పిలక రామ్మోహన్ రెడ్డి (పిలక రాము) ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిగా హాజరైన మళ్ల విజయప్రసాద్ తొలుత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇసుక ద్వారా రాష్ట్రానికి ఆదాయం వచ్చే విధంగా చేస్తే, నేటి కూటమి ప్రభుత్వం ఉచితంగా ఇసుక ఇస్తామని చెప్పి కూటమి నాయకుల జేబులు నింపుకుంటున్నారని ఆరోపించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చి ఆర్థిక పరిస్థితిని అత్యంత ఆందోళనకరంగా మార్చిందని ధ్వజమెత్తారు.



91వ వార్డులో కూటమి మోసాలను వివరిస్తున్న మళ్ల విజయప్రసాద్

రెండెకరాల ఆసామి నేడు ధనిక సీఎం

అసోసియేషన్ ఫర్ డెమక్రాటిక్ రిఫామ్స్ తాజా నివేదిక ప్రకారం దేశంలో అత్యంత ధనవంతుడైన సీఎం చంద్రబాబు అని ప్రకటించిందన్నారు. రెండు ఎకరాల భూమి గల చంద్రబాబు ఇంత ఆస్తి అవినీతి చేయకుండానే సంపాదించారా అని ప్రశ్నించారు. కూటమి పాలనలో మహిళలకు భద్రత లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి వైఫల్యాలను నిలదీస్తే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టడం..భౌతిక దాడులకు దిగడం కూటమి సర్కారు చేతకాని తనానికి నిదర్శనమన్నారు. తల్లికి వందనం కొందరికే పరిమితం అయ్యిందని,ఉచిత గ్యాస్ డబ్బులు ఖాతాల్లో పడడం లేదన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ గాలికి...

తమకు అధికారం ఇస్తే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా చూస్తామని చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌తో పాటు నేతలు ఊదరగొట్టి... ఇప్పుడు నోరుమెదపడం లేదన్నారు. సుమారు 6 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందంటే వీరి పాలన ఎలా ఉందో ప్రజలు గ్రహించాలన్నారు. అనంతరం డిజిటల్ స్క్రీన్‌పై కూటమి నేతల మోసాలను ప్రజలకు చూపించారు. కార్యక్రమంలో లీగల్ సెల్ ప్రతినిధి పీలా మాధవి, మాజీ కార్పొరేటర్ పిల్లా కన్నబాబు, పార్టీ సీనియర్ నాయకులు భోగవల్లి నాగభూషణం,కొల్లి నూకరెడ్డి, పీలా అనంత్‌కుమార్,వంక గోపిరాజు,చిన్నిరెడ్డి,ఎస్.వి.రమణ,సోనూ,పట్నాల పెంటారావు, ఈ.మధుబాబు,బద్రిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ. 2 లక్షల విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి ఆదివారం నగరంలోని ఆటోనగర్‌కి చెందిన జి.వెంకటనాయుడు దంపతులు రూ. 2 లక్షల 8 వేల విరాళాన్ని అందజేశారు. సంబంధిత చెక్కుని పీఆర్‌వో కార్యాలయంలో ప్రోటోకాల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావుకి అందజేశారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌వో కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ వరహానరసింహం పాల్గొన్నారు.



సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావుకి చెక్కు అందజేస్తున్న దాత

ఐద్వా మహాసభల విజయవంతానికి పిలుపు

పరవాడ: అక్టోబరు 13, 14, 15 తేదీల్లో జరగనున్న ఐద్వా రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని అనకాపల్లి జిల్లా ఐద్వా అధ్యక్షురాలు పి.మాణిక్యం కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆదివారం జరిగిన కార్యక్రమంలో మహాసభల పోస్టర్‌ను ఆమె విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చిన్నారులు, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు.